నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | NIRMAL

కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి

ముథోల్, ఫిబ్రవరి 21 : బీఆర్ఎస్ కార్యకర్తలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సీనియర్ నాయకుడు మక్బుల్ కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరపున రూ.2 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు ఎజాజొద్దీన్, మాజీ ఎంపీటీసీ పోతన్న యాదవ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ సరళ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌గా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ

మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సమయ్ జాన్‌రావు, శిక్షణకు హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులు

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : కానిస్టేబుల్స్‌గా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. సూర్యాపేట, సంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుంచి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు ఎస్పీ సమయ్ జాన్‌రావు మాట్లాడారు. అవుట్ డోర్, ఇండోర్ రంగాలతోపాటు ఎనిమిది సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ తొమ్మిది నెలలపాటు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ సీఐలు టీ.మురళి, నవీన్, కార్తీక్ ఉన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న బంజారా నాయకులు

సేవాలాల్ మార్గం ఆచరణీయం

- వైభవంగా సేవాలాల్ జయంతి
- హాజరైన కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, ఎమ్మెల్యేలు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 21 : శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సేవా మార్గం ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఉద్ఘాటించారు. బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని మల్లన్న గుట్ట జగదాంబాదేవి ఆలయం వద్ద నిర్వహించిన సేవాలాల్ 285వ జయంతి వేడుకల్లో ముథోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు బొజ్జు పటేల్, రామారావు పటేల్‌లతో కలిసి పాల్గొన్నారు. అధికారికంగా నిర్వహిస్తున్న వేడకల సందర్భంగా సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ సమాజంలో సత్యం, ధర్మం, సేవాగుణం నేర్పిన వ్యక్తి అన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందిస్తామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. బంజారాల ఆధ్యాత్మిక గురువు లింబారాం మహారాజ్ ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పైజాన్‌అహ్మద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ నాయక్, ఆర్డీవో రత్నకల్యాణి, బంజారా సంఘం నాయకులు రాజేశ్ నాయక్, జాదవ్ నరేశ్, తుకారాం నాయక్, బలిరాం నాయక్, జానాబాయి, గోవిందనాయక్, ప్రకాశ్ నాయక్, రాజేందర్ నాయక్, సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

వేతన వెతలు

- జీతాల కోసం నిరీక్షిస్తున్న ఐకేపీ ఉద్యోగులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గుర్తింపు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖున వేతనాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఐదో తారీఖు వరకు వేతనాలు పడగా.. ఐకేపీ ఉద్యోగులకు మాత్రం 20 రోజులు గడుస్తున్నా రాలేదు. మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, ఉపాధి కల్పనలో కీలకంగా వ్యవహరించే ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఐకేపీలో 101 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో ఒకరు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, ఏడుగురు జిల్లా ప్రాజెక్టు మేనేజర్(డీపీఎం)లు, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్(ఏపీఎం)లుగా 21 మంది, 44 మంది ఎంఎస్‌సీసీలు, మిగతా వారు సీసీలుగా పని చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ పథకాల అమలులో ఐకేపీ ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఒకటో తేదీన జీతాలు పడుతాయని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేక పోతున్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయం

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేస్కేల్

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న మహిళా సంఘాల ప్రగతికి కృషి చేస్తున్న ఐకేపీ ఉద్యోగులకు కేసీఆర్ ప్రభుత్వం రెగ్యూలర్ చేసి, పేస్కేల్ అమలు చేస్తున్నది. ఫలితంగా ఉద్యోగ భద్రత లభించడమే కాకుండా.. ఇతర ఉద్యోగుల మాదిరి వేతనాలు లభించే అవకాశం ఏర్పడింది. దీంతో మహిళా సంఘాలు వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ సహకారం, బ్యాంకు రుణాలతో ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకుంటున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఏండ్లుగా కోరుతున్నా.. గుర్తింపు లభించడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ఐకేపీ ఉద్యోగులను అన్ని విధాలుగా ఆదుకున్నది. ప్రభుత్వ పథకాల అమలు, మహిళా సంఘాల ప్రగతి కోసం పనిచేస్తున్న తమకు ఇతర ఉద్యోగుల మాదిరి ప్రతి నెల వేతనాలు మంజూరు చేయాలని ఐకేపీ ఉద్యోగులు కోరుతున్నారు.

మేము రెడీ..

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేశాం..

- ఈనెల 28 నుంచి మార్చి 16 వరకు కొనసాగుతాయి..
- 13,345 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు..
- ఆన్‌లైన్ నుంచి హాల్‌టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు..
- నిమిషం ఆలస్యం కావద్దు.. గంట ముందుగానే చేరుకోవాలి..
- 'నమస్తే'తో డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీఐఈవో) పరశురాం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 : ''ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈనెల 28వ తేదీ నుంచి రెగ్యులర్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. మార్చి 16వ తేదీతో ముగుస్తాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ముగిశాయి. తొలిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్, పర్యావరణంపై ప్రాక్టికల్స్ జరిగాయి.'' అని డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీఐఈవో) పరశురాం తెలిపారు. త్వరలో జరుగనున్న ఇంటర్మీడియల్ పరీక్షల నిర్వహణపై ఆయన 'నమస్తే తెలంగాణ'కు ఇంటర్వ్యూ ఇచ్చారు.

'నమస్తే'తో మాట్లాడుతున్న పరశురాం

నమస్తే : ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను వివరించండి?

డీఐఈవో : ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నాం. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో 23 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. మండలానికి ఒకే కళాశాల ఉన్న చోట ఎనిమిది సెల్ఫ్ సెంటర్స్ ఏర్పాటు చేశాం. ముథోల్, భైంసా పట్టణాల్లో సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాం. ఈ కేంద్రాలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచుతాం.

నమస్తే : ఎంత మంది విద్యార్థులు హాజరవుతున్నారు?

డీఐఈవో : నిర్మల్ జిల్లావ్యాప్తంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరం కలిపి 13,345 మంది విద్యార్థులు పరీక్షకు హాజరువుతున్నారు. ఇందులో ప్రథమ సంవత్సరంలో రెగ్యులర్ 5,463.. ఒకేషనల్ 1,072 మొత్తం 6,535 మంది విద్యార్థులు.. ద్వితీయ సంవత్సరంలో రెగ్యులర్ 5,772, ఒకేషనల్ 1,038 మొత్తం 6,810 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

నమస్తే : మాస్ కాపీయింగ్ నిరోధానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీఐఈవో : ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నిరోధానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, పరీక్షల పర్యవేక్షణ కోసం ముగ్గురు జిల్లా స్థాయి అధికారులు ఉంటారు. ఇందులో డీఐఈవో, సీనియర్ ప్రిన్సిపాల్, సీనియర్ లెక్చరర్‌లతో ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ మాస్ కాపీయింగ్ నిరోధానాకి చర్యలు తీసుకుంటున్నాం. మాస్ కాపీయింగ్ పాల్పడితే వెంటనే 79979 94358 నంబర్‌కు ఫోన్ చేయాలి.

నమస్తే : ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో : గతేడాది ప్రథమ సంవత్సరంలో 62 శాతం.. ద్వితీయ సంవత్సరంలో 67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేందుకు సెలబస్‌ను సకాలంలో పూర్తి చేయించి విద్యార్థులకు రీవిజన్, స్టడీ అవర్స్, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. గతేడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధిస్తాం.

నమస్తే : ఫీజుల ఒత్తిడి, హాల్‌టికెట్ల అందజేతపై చర్యలు ఏమిటీ?

డీఐఈవో : ప్రైవేట్ యాజమాన్యాలు ఒత్తిడి లేకుండా విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయాలని ఆదేశించాం. ఇవ్వకపోతే కచ్చితమైన చర్యలు తీసుకుంటాం. హాల్‌టికెట్‌లను నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నమస్తే : ఎలాంటి నిబంధనలు అమలులో ఉన్నాయి?

డీఐఈవో : నిమిషం ఆలస్యమైనా తరగతి గదిలోకి అనుమతి లేదు. కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రశ్నాపత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో తెరుస్తాం.

జీతాలూ మహాప్రభో..

కొత్త ప్రభుత్వంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు అందని వేతనాలు

- రెండు నెలలుగా ఎదురుచూపు.. కుటుంబాల పోషణకు కష్టాలు
- ఇచ్చిన హామీని నిలుపు కోవాలంటున్న అంగన్‌వాడీలు

కరీంనగర్, ఫిబ్రవరి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసనసభా ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆనెల నిధులు విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరోగ్యలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా రూ.100 నుంచి రూ.200లు పెంచేవారు. అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో నిమిత్తం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం రూ.3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు రూ.13,650, హెల్పర్లకు రూ.7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్‌సీ అమలు చేసింది. అయితే కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటో వేతనాలు కాస్త ఆలస్యమయ్యాయి. కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

నేడు జీతాల కోసం నిరీక్షణ

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏనెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 35వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ద్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా గజ్జలమ్మ వార్షికోత్సవం

కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కుంటాల, ఫిబ్రవరి 21 : కుంటాల మండలంలో గజ్జలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు భగవతి ప్రార్థన, మహాగణపతి, అగ్ని ప్రతిష్ఠ, రథ జలాభిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. హోమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనకు మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భైంసాకు చెందిన ప్రణీత-శ్రీనివాస్ దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ సమితి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

జాతీయ సమైక్యత శిబిరంలో

ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

బాసర, ఫిబ్రవరి 21 : కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, బోనాలు, పీరీల పండుగ వంటి అంశాలపై తమ ప్రదర్శనను ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఉత్సాహంగా ఉందని విద్యార్థులు తెలిపారు. బుధవారం విద్యార్థులకు డైరెక్టర్ సతీశ్‌కుమార్ ఎన్ఎస్ఎస్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం కో-ఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పత్రాలు అందుకున్న విద్యార్థులతో అధికారులు

ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల ధర్నా

- 50 కిలోల బస్తాలో రెండు కిలోల బియ్యం తరుగు
- డీఎస్వో కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేత

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బేల మండలాల్లో మండల్ లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) పాయింట్‌లో కాంటా వేయకుండా డీలర్లకు బియ్యం పంపిణీ చేయడం వల్ల ఒకటి నుంచి రెండు కిలోలు తరుగు వస్తున్నాయని బుధవారం డీలర్లు ఆందోళన నిర్వహించారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ.. కార్డుదారులకు ఈ-పాస్ మిషన్ ద్వారా బియ్యాన్ని పారదర్శకంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కానీ.. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చే ప్రతి 50 కిలోల బస్తాలో ఒకటి నుంచి రెండు కిలోల బియ్యం తరుగు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం నింపే గోనే సంచులు నాణ్యమైనవి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం కేజీ రూ.29, కంది పప్పు, మిగతా సరుకులను రేషన్ షాపు నుంచి సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఆదిలాబాద్ డీఎస్వో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు వసంత్, కిరణ్ కుమార్, అనిల్ పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మలకు పూజలు

గద్దెల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 21 : యువత భక్తి భావంతో మెలగాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం తలమడుగు మండలంలోని కజ్జర్లలో అత్యంత భక్తిశ్రద్ధలతో సమ్మక్క-సారలమ్మ జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కజ్జర్లలోని సమ్మక్క-సారలమ్మలకు పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తిభావంతో మెలగాలని సూచించారు. అనంతరం మహిళలు వనదేవతలకు పూజలు చేసి తమ పసుపు కుంకుమలను కలకాలం కాపాడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్, రవికాంత్ యాదవ్, శాంత ప్రమోద్, రాజు, మున్న, తిరుపతి, చిన్నన్న పాల్గొన్నారు.

ఎండిన మక్కజొన్న వద్ద రైతు బాలాజీ

వట్టిపోయిన మక్క

భైంసా, ఫిబ్రవరి 21 : నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని ఖత్‌గాం గ్రామంలో నీరు లేక మక్కజొన్న ఎండిపోతున్నది. బాలాజీ అనే రైతు ఎకరంలో మక్క సాగు చేశాడు. విద్యుత్ సరిగా లేకపోవడంతో నీరు అందక పంట పూర్తిగా ఎండిపోయింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 24 గంటల కరెంటు ఉండడంతో పంటలు సమృద్ధిగా పండేవని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 12 గంటలు విద్యుత్ ఇవ్వడంతో నీరందివ్వలేక పంటలు ఎండిపోతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


సాగునీరు అందక ఎండిపోయిన పొలం

వరికి నీరేదీ?

- సాగు నీరందక బీటలు వారుతున్న పొలాలు
- వెంగ్వాపేట్‌లో వృథాగా వదిలేసిన రైతు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 : ఈ యాసంగిలో పంటలకు సక్రమంగా నీరందక పొలాలు బీటలు వారుతున్నాయి. స్వర్ణ ప్రాజెక్టు కింద నిర్మల్ మండలంలోని వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన సాయన్న ఎకరం భూమిలో నారు పోశాడు. వాగులో నీరు లేక.. సాగుకు నీరందక నారు కూడా వట్టిపోయింది. దీంతో చేసేది లేక పశువులను మేపాడు.

బీజేపీది.. సర్వనాశనం యాత్ర

- ఏ ముఖం పెట్టుకుని బండి వచ్చాడు..
- సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం, ఫిబ్రవరి 21 : బీజేపీ తలపెట్టిన విజయ సంకల్ప యాత్ర కాదు.. సర్వనాశనం యాత్ర అని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. కుల,మతాలతో రెచ్చగొట్టి దేశాన్ని నాశనం చేస్తున్నారని పేర్కొన్నారు. ఏ ముఖం పెట్టుకుని బండి సంజయ్ సంకల్ప యాత్రతో ఆదిలాబాద్‌కు వస్తుడో చెప్పాలన్నాడు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యురాలు నళినరెడ్డి ఉన్నారు.